క్లుప్తంగా

అపర చాణుక్యుడు కొణిజేటి

రోశయ్య, అల్లూరి సీతారామరాజులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి నివాళి



నరసరావుపేట: దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అపర మేధావితనంతో చాణుక్యునివలే రాజకీయాల్లో వ్యవహరించారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. మంగళవారం గుంటూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రోశయ్య జయంతి కార్యక్రమం సందర్భంగా శివునిబొమ్మ ఐలాండ్ సెంటర్‌లోని రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 90 మంది పేదలకు నిత్యావసరాలు, మరో 90మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, మరో 90మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. అదే కార్యక్రమంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఊర భాస్కర రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్ బాబు, ఆర్యవైశ్య నాయకులు పెనుగొండ వెంకటేశ్వర రావు, వి.సాంబశివరావు, దివ్వెల రామకృష్ణ, మిట్టపల్లి శేఖర్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు ఆతుకూరి రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.

కంటి వెలుగు పథకంలో ఉచిత వైద్యసేవలు

బొల్లాపల్లి: కంటి వెలుగు పథకంలో భాగంగా మండలంలోని రావులాపురం జెడ్పీ హైస్కూల్‌లో వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు ఉచితంగా మంగళవారం నిర్వహించారు. రావులాపురం సచివాలయ పరిధిలో గార్లదిన్నె, మన్నేపల్లితండా, బోడిపాలెంతండా తదితర ప్రాంతాల నుంచి సుమారు 180 మంది ఉచితంగా వైద్యసేవలు అందజేసినట్లు ఆప్తాలమిక్ అధికారి టి. నరసింహారావు తెలిపారు. ఉచిత వైద్యసేవలతో పాటు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. వై. ఆంజనేయులు, జీవీ లక్ష్మీనారాయణ, ఆప్తాలమిక్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, ఎ.ఎన్.ఎం., ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహాలు, ఖాళీ స్థలాల సర్వే

వినుకొండటౌన్: పట్టణంలోని గృహాలు, ఖాళీ స్థలాలను సర్వే చేసి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెబ్‌ల్యాండ్ డేటా బేస్ తయారు చేసేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీ టీంలు ఇళ్ల వద్దకు వచ్చిన సమయంలో మీ గృహం, ఖాళీ స్థలాలకు సంబంధించి డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలను అందజేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సహకరించాలని సూచించారు.

ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ

బొల్లాపల్లి: జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా కంది పంట సాగుకు రైతులకు ఉచితంగా కందులు అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి ఎ. అంకారావు మంగళవారం తెలిపారు. రావులాపురం సచివాలయ పరిధిలో ఎంపీపీ బత్తిరాములు చేతుల మీదుగా రైతులకు కంది విత్తనాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అదనపు ఆదాయం సమకూరేందుకు అంతర పంట, గనేలా మీద పంట కంది సాగు చేసుకునేందుకు కంది విత్తనాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలానికి 600 ఎకరాల్లో 24 క్వింటాళ్ల కందులు వచ్చాయని, వీటిని ఆయా సచివాలయాల పరిధిలో అర్హత కలిగిన ప్రతి రైతుకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కారుమంచిలో గడప గడపకు మన ప్రభుత్వం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీలో గురువారం ఉదయం గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చందూరి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవుతారన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 1584 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు
- వేల్పూరు రెండు గ్రామసచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీలో రెండు గ్రామసచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమక్షంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని మాట్లాడుతూ అర్హత కలిగి నేటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందనటు వంటి లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు జరుగుతుందన్నారు. చిన్నపాటి సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. వేల్పూరు గ్రామ పంచాయతీలో గతంలో ఏన్నుడు లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా రూ. 6 కోట్లు వ్యయంతో కోల్డ్‌స్టోరేజ్ పనులు తుదిదశకు చేరాయని త్వరలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ. కోటి 60 నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే వెలమవారిపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ. 80 లక్షలు, గంటావారిపాలెం రూ. 80 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ ద్వారా పైపులైను పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వెలమవారిపాలెం గ్రామంలో దీర్ఘకాలంగా 34 ఎకరాల ఈనాం భూములు కలిగిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 1584 మంది లబ్ధిదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాస రావు, ఉప సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఎంపీటీసీ లింగాల పున్నమ్మ, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి కబ్బారావు, ముండ్రు రాఘవరావు, స్వర్ణాల వెంకట్రావు, బోయపాటి రామాంజినేయులు, డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఏవో రామినేని రామారావు, పంచాయతీ కార్యదర్శులు ఆళ్ళ యుగంధర్, కొమిటినేని అశోక్‌చౌదరి, వీఆర్వోలు శ్రీను, వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: అర్హత ఉండి గతంలో లబ్ధిపొందని వారికి తగు రీతిలో జగనన్న సురక్షలో న్యాయం చేసేందుకే ఈ కార్యక్రమమని ఎంపీపీ బత్తిరాములు అన్నారు. మండలంలోని రావులాపురం, గండిగనుమల సచివాలయాల పరిధిలో తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషాలు రెండు టీంలు ఆయా సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ బత్తిరాములు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు 11 రకాల సేవలు ఉచితంగా అందజేయడం జరుగుతుంద న్నారు. రావులాపురంలో తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ ఈ సచివాలయం పరిధిలో 930 టోకెన్లు నమోదయ్యాయని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వ సంక్షే మం సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. జిల్లాలో టోకెన్ల నమోదులో ఈ గ్రామ సచివాలయం ప్రథమ స్థానంలో నిలిచిందని తహశీల్దార్ తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా మాట్లాడుతూ గండిగనుమల గ్రామంలో 836 టోకెన్లు నమోదయ్యాయని, ప్రస్తుతం 587 సేవలు ఉచిత సేవలు లబ్ధిదారులు పొందారని తెలిపారు. జిల్లాలోనే అర్జీల నమోదులో గ్రామ సచివాలయం మూడో స్థానంలో నిలిచిందన్నారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తల్లి పిల్లల హాస్పటల్ వద్ద ఉన్న కొత్తపేట-1,2 సచివాలయాల్లో మంగళవారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు.

రొంపిచర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందజేయడమే జగనన్న సురక్షా కార్యక్రమ లక్ష్యమని తహసీల్దార్ అంకారావు అన్నారు. మండలంలోని సంతగుడిపాడు, తురిమెళ్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. సభలకు 366 అర్జీలు రాగా వాటిని వెంటనే పరిష్కరించి అవసరమైన ధృవపత్రాలను అందజేశారు. తురిమెళ్ల గ్రామంలో 111 అర్జీలు రాగా, సంతగుడిపాడులో 255 అర్జీలు వచ్చాయి. ఆధార్‌కు సంబంధించి 79 అర్జీలు రాగా, ఆదాయ పత్రాల కోసం 117 మంది, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 120, కౌలు దారుల పత్రాల కోసం 26 మంది అర్జీలు దాఖలు చేసుకోగా వెంటనే వాటిని పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

ఈపూరు : మండల కేంద్రమైన ఈపూరు గ్రామసచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాకమూరి బుచ్చయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోపెల దేవరాజ్, ఈపూరు సహకార పరపతి సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, ఈపూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోనుగుంట్ల హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకయ్య



రావులాపురం జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్న లబ్ధిదారుడు



సంతగుడిపాడు, తురిమెళ్ల గ్రామాల్లో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న అధికారులు

24 గంటల్లో లబ్ధిదారుల ముంగిట్లోకి...



ఎస్టీ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: ఎన్నో ఏళ్లు గడిచినా అందని ధ్రువపత్రాలు జగనన్న సురక్ష పథకంలో అందుతున్నాయని, లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమౌతోందని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రాజ్యలక్ష్మి రామిరెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ నిర్వహించారు. సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాదెండ్ల, గణపవరం పీఏసీఎస్ అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ యామర్తి సునీత హాజరయ్యారు. ఈ గ్రామంలో 1097 గృహాలకు గాను 800 గృహాలకు పైగా గత వారం రోజులుగా సర్వే జరగ్గా, సుమారు 400 మందికి పైగా ధృవపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి నెలాఖరు వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం గ్రామంలో సాయంత్రం 5 గంటల వరకూ అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ పత్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ మస్తాన్‌రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాల్లో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. అనంతరం జగనన్న సురక్ష క్యాలెండర్‌ను అధికారులు, నాయకులు ఆవిష్కరించారు. అర్హులైన పలువురు ఎస్టీ లబ్ధిదారులకు పొజిషన్ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్ఐ షేక్ రమీజా, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, యన్నం శివారెడ్డి, రత్తయ్య, పంచాయతీ కార్యదర్శి స్వాతి, వీఆర్వో అనూష పాల్గొన్నారు.

రేషన్ కార్డులో మార్పులు చేశారు



నేను కూలిపనులు చేసుకుని జీవిస్తుంటా. పదమూడేళ్ళ క్రితం నా భర్త మృతి చెందారు. నాకు నాగరాజు అనే కుమారుడు ఉన్నాడు. కుమారుడికి మూడేళ్ళ క్రితం పరమగీతతో వివాహమైంది. వీరికి హాలీలా అనే కుమార్తె ఉంది. గతంలో రేషన్ కార్డులో కోడలు, మనుమరాలి పేరు కలపాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాను. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోగా, కేవలం 24 గంటల్లోనే రేషన్ కార్డులో మార్పులు చేసి పేర్లు నమోదు చేశారు. ఏళ్లకు ఏళ్లు తిరిగినా సాధ్యం కాని పనులు జగనన్న ప్రభుత్వంలో త్వరితగతిన పూర్తవటం హర్షణీయం. ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని పాలించే పాలకుడే మా జగనన్న.

–గోళ్లమూడి భాగ్యమ్మ, చిరుమామిళ్ళ.

ఆరోగ్యశ్రీ కార్డు రావడం చాలా సంతోషం



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాలాంటి పేదలకు న్యాయం జరగటం చాలా సంతోషంగా ఉంది. ఈవిధంగా గ్రామసచివాలయాల ద్వారా నేరుగా వలంటీర్లు సర్వే చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వివిధ రకాల ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయటం గతంలో ఎన్నుడు చూడలేదు.

–కామేపల్లి సింధు, వేల్పూరు–1

కౌలు రైతు కార్డు మంజూరు



మాది వేల్పూరు గ్రామం నాపేరు గుంటకల అయ్యన్న మాది బీసీ కులం. నాకు సెంటు భూమి కూడా లేదు. గతంలో కౌలు రైతు కార్డు కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగే వారం. ప్రస్తుతం సచివాలయాల వ్యవస్థ వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు ఈవిధమైన సేవలు అందించటం మంచి శుభపరిణామం. ఇక నాకు రైతు భరోసా పథకం వర్తిస్తుంది.

–గుంటకల అయ్యన్న, వేల్పూరు–2

చాలా సంతోషంగా ఉంది



ఆదాయ కుల ధ్రువీకరణ పత్రం పొందా. గతంలో జగనన్న సంక్షేమంలో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా పథకంతో లబ్ధిపొందా. ప్రస్తుతం జగనన్న సురక్ష వలన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోగలిగా. అదికూడా స్వగ్రామంలో సచివాలయంలో ఒకేసారి ఇలాంటి లబ్ధిచేకూరడం సంతోషకరం.

–బి. వెంకట నర్సమ్మ, లబ్ధిదారురాలు, బొల్లాపల్లి మండలం

పదిహేనేళ్లకు సర్టిఫికెట్ వచ్చింది



మాది పేద కుటుంబం. మా తల్లిదండ్రులైన జెట్టి వీరాస్వామి, బ్రహ్మేశ్వరిలకు నేను ఏకైక సంతానం. నేను ఎనిమిదేళ్ల వయస్సులో ఉండగా తల్లిదండ్రులు ఇరువురూ మృతి చెందారు. నాయనమ్మ రామాంజమ్మ సంరక్షణలో పెరిగా. మా తల్లిదండ్రులు మృతి చెందటంతో అప్పట్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా, ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సర్టిఫికెట్ అందలేదు. దీంతో నా చదువుకు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ అందలేదు. ప్రస్తుతం నేను ఎంబీఏ పూర్తి చేశాను. హుడాలో పనిచేస్తున్నాను. సచివాలయ సిబ్బంది సోమవారం రోజు మా ఇంటికి రాగా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశా. మరుసటిరోజే సర్టిఫికెట్ అందటంతో ఎంతో ఆనందంగా ఉంది. గతంలోనే సర్టిఫికెట్ వచ్చి ఉంటే నాకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేవాడిని. ఈ సర్టిఫికెట్‌తో నాకు ఎంతో మేలు కలుగుతుంది. హ్యాట్సాఫ్ టు జగనన్న.

–జెట్టి రామకృష్ణ, చిరుమామిళ్ళ.

మన సంక్షేమం దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- విఠంరాజుపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడపగడపకు తిరిగి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను దగ్గర చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, తోపాటు అనేక అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వినుకొండ రూరల్ మండలంలో గోకనకొండ వద్ద గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మాణంతో పాటు అనేక పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి నెలా అవ్వాతాతలకు 1వ తేదీనే పింఛను అందిస్తున్న ఘనత తమదేనన్నారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి పనులు చేయలేక తాము చేస్తున్న అభివృద్ధి పనులు అడ్డుకోవడమే పనిగా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని సరైన రీతిలో మళ్లీ గుణపాఠం చెబుతారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, ఉపసర్పంచ్ పి.రామిరెడ్డి, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామ తులసిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, అయ్యప్పరెడ్డిలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

వినుకొండ(నూజెండ్ల): వైద్యం అందక గర్భిణీ మృతిచెందిందని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాల వద్ద మృతురాలి బంధువులు ఆందోళన చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం... ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన కె.అనూష (25) ఐదు నెలల గర్భిణి. వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం వెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం సదరు మహిళకు రక్తం శాతం తక్కువగా ఉందని, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబసభ్యులు ఆమెను గుంటూరుకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతిచెందింది. దీంతో మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి నిర్వాహకులు, ఆందోళన కారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- రెండో వార్డు జగనన్న సురక్షలో ఎమ్మెల్యే గోపిరెడ్డి
- ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు పంపిణీ



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జగనన్న సురక్ష కార్యక్రమంలో ద్వారా అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని రెండో వార్డు సచివాలయంలో మున్సిపల్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి 'జగనన్న సురక్ష' క్యాంపు నిర్వహించారు. ఇప్పటికే 99 శాతం అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. చిన్న చిన్న కారణాలతో వర్తించని ఒకశాతం లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు, అదే విధంగా పైసా ఖర్చు లేకుండా ఆదాయ, కుల, జనన మరణ, తదితర 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. రెండో వార్డులోని సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వివిధ అర్జీలను తక్షణమే పరిశీలించి అర్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. దేశంలో ఇలాంటి కార్యక్రమం ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. ప్రజలు వివరించిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రమేష్, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ యర్రంశెట్టి బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి కొండ, నిమ్మిశెట్టి శ్రీనివాసరావు, తిప్పరయ్య పాల్గొన్నారు.

పేద ప్రజల కోసం ప్రాణాలు వదిలిన ధీరుడు వంగవీటి

నరసరావుపేట: కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా నిలబడి, పేద ప్రజల కోసం ప్రాణాన్ని సైతం లెక్కచెయ్యక చావుకు ఎదురెళ్లి పోరాడిన మహానేత, స్వర్గీయ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. మంగళవారం రంగా 76వ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుంటూరు రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ రమేష్, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్ యర్రంశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

చిలకలూరిపేట: నిరుపేదల హక్కుల సాధన కోసం జీవితం అంకితం చేసిన వంగవీటి మోహనరంగా పేదల ఆత్మబంధువని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. రంగా జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు తలహాఖాన్, నాయకులు వడితే కోట్యానాయక్ పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం.. అల్లూరి సేవా స్ఫూర్తి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: అల్లూరి సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 1920 నుంచి 1924 మధ్యకాలంలో పేదల కోసం బ్రిటీష్ వారితో అల్లూరి చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. విద్యార్థులు దేశభక్తి, సేవాభావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖర రెడ్డి, రోటరీ ప్రతినిధులు జమ్ముల రాధాకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసరావుపేటరూరల్: ఎస్ఆర్‌కేటి కాలనీలోని మండల పరిషత్ పరిషత్ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.గురులింగం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, ధైర్య సాహసాలు, పోరాటాలను విద్యార్థులకు వివరించా రు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు కె.సుధాకర్, యస్‌వీ సుబ్బారావు, ఫాతిమారాణి, ఎం.అపర్ణలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అల్లూరి సీతారామరాజు త్యాగం మరువ లేనిదని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి మంగళవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు తోట బ్రహ్మస్వాములు, కోట్యానాయక్, బేరింగ్‌మౌలాలి, తోట నాగలక్ష్మి, బక్షు మేస్త్రి, సాపా సైదావలి, దారా అరుణకుమారి, షేక్ నాగుల్ మీరా, యాదవ సుజాత, బండారు జయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రావులాపురం సచివాలయంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకున్నారు. ఎంపీపీ బత్తిరాములు, సర్పంచ్ ఎ. పున్నారెడ్డి, ఎంపీటీసీ ఎర్రయ్య, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ డి.గోవిందునాయక్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, కృష్ణానాయక్, అవినాష్ రెడ్డిలు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నరసరావుపేట రూరల్: ములకలూరు గ్రామానికి చెందిన ఎస్‌కె బీబీ గుండె సంబంధిత వ్యాధితో గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామానికి చెందిన వలంటీర్ ఇర్ఫాన్ మంగళవారం గుంటూరు వెళ్లి బీబీకి పెన్షన్ అందజేశాడు. వలంటీర్ సేవాస్ఫూర్తిని బీబీతో పాటు ఆమె బంధువులు అభినందించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ కారణంగానే ఆసుపత్రిలో ఉన్న తనకు ఫించన్ అందిందని బీబీ సంతోషం వ్యక్తం చేసింది.